నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | బుధవారం 18 డిసెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

కాగజ్‌నగర్ రూరల్ : నినాదాలు చేస్తున్న డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, నాయకులు

జన్నారం: అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలుపుతూ..


మంచిర్యాల టౌన్: అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు

బెల్లంపల్లి: అంబేద్కర్ చౌరస్తా వద్ద ..

లగచర్ల ఘటనపై ఆగ్రహ జ్వాల

అక్రమ కేసులు, థర్డ్ డిగ్రీ ప్రయోగించడంపై మండిపాటు

- కేటీఆర్ పిలుపు మేరకు అంబేద్కర్ విగ్రహాలకు వినతులు
- బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, శ్రేణుల నిరసనల హోరు

చెన్నూర్: ప్లకార్డులు ప్రదర్శిస్తూ..

మందమర్రిలో..

లగచర్ల రైతులపై అక్రమ కేసులు, థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్లలో నిర్బంధించినందుకు నిరసనగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు మంగళవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మంచిర్యాల జిల్లావ్యాప్తంగా నిరసనలు చేపట్టారు. రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేసి వారిని వెంటనే విడుదల చేయాలంటూ అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించారు. మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహానికి మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆధ్వర్యంలో లక్షెట్టిపేట మున్సిపల్ చైర్మన్ నల్లాసు కాంతయ్య, బీఆర్ఎస్ మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం అందించారు. జన్నారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో, బెల్లంపల్లి పట్టణంలోని కాంటా చౌరస్తా వద్ద, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆదేశాల మేరకు చెన్నూర్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి, మందమర్రిలోని సింగరేణి పాఠశాల వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాలు అందించారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి, కాగజ్‌నగర్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పూలమాల వేసి వినతి పత్రం అందించారు. - నమస్తే నెట్‌వర్క్

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్: అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ హైమద్, బీఆర్ఎస్ నాయకులు

ప్రత్యేక వైద్య నిపుణులను నియమిస్తాం

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- బెల్లంపల్లిలో వంద పడకల దవాఖాన తనిఖీ

బెల్లంపల్లి, డిసెంబర్ 17 : వంద పడకల దవాఖానలో పూర్తిస్థాయిలో ప్రత్యేక వైద్య నిపుణులను నియమించడానికి కసరత్తు చేస్తున్నామని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం బెల్లంపల్లిలోని వంద పడకల దవాఖానను ఆయన తనిఖీ చేశారు. డయాలసిస్ సెంటర్, ల్యాబ్, వివిధ విభాగాలు, వార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్యం అందుతున్న తీరును ఆయన అడిగి తెలుసుకున్నారు. దవాఖాన గోడ నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించాలని అధికారులకు సూచించారు. అలాగే మండలంలోని చర్లపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న అదనపు గదుల నిర్మాణాలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య బోధిస్తారని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థులతో మాట్లాడి తరగతులు ఎలా నడుస్తున్నాయని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు ఉన్నారు.

వంద పడకల దవాఖానను పరిశీలిస్తున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

ఆయిల్ పాం విస్తరణ ఆగినట్లేనా!?

- 1,048 ఎకరాలు సాగు లక్ష్యం
- పట్టించుకోని అధికారులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, డిసెంబర్ 17(నమస్తే తెలంగాణ) : కుమ్ర భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఆయిల్ పాం విస్తరణ ఆగిపోయినట్లే కనిపిస్తోంది. అధికారులు పట్టించుకోకపోవడంతో కొత్త తోటల సాగు సందిగ్ధంలో పడింది. ఈ ఏడాది మార్చి నాటికి 1048 ఎకరాల్లో ఆయిల్ పాం తోటలను విస్తరించాలని లక్ష్యం పెట్టుకోగా.. నాలుగు నెలలుగా ముందుకు సాగడం లేదు. ప్రస్తుతం జిల్లాలో 23 మంది రైతుల వ్యవసాయ క్షేత్రాల్లో 129 ఎకరాల్లో సాగవుతుండగా.. ఇక అక్కడితోనే బ్రేక్ పడేలా ఉంది. అధికారులు తోటలను విస్తరించే దిశగా చర్యలు తీసుకోకపోవడంతో రైతులు నిరుత్సాహానికి గురవుతున్నారు.

కేసీఆర్ హయాంలో ప్రోత్సాహం

రైతులకు స్థిరమైన ఆదాయం కల్పించేందుకు కేసీఆర్ సర్కారు ఆయిల్ పాం తోటల పెంపకాన్ని ప్రోత్సహించింది. నష్టాలు లేని సాగు వైపు మళ్లించేందుకు చర్యలు తీసుకున్నది. మాట్రిక్స్ కంపెనీకి బాధ్యతలు అప్పగించడంతోపాటు మొక్కల సరఫరాలో రైతులకు రాయితీని అందించింది. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని రైతులకు మొక్కలను సరఫరా చేసేందుకు మంచిర్యాల జిల్లాలోని భీమారంలో ప్రత్యేకంగా నర్సరీని ఏర్పాటు చేశారు. ఒక్కో మొక్క ఖరీదు రూ.213 ఉండగా రూ.193 సబ్సిడీని అధికారులు కల్పించారు. మిగతా రూ.20 రైతులు తమ వాటా కింద చెల్లించాల్సి ఉంటోంది. అంతేకాకుండా ఆసక్తి ఉన్న రైతులకు రూ. లక్షతో డ్రిప్‌లను అందజేసింది. ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం రాయితీతో ఇస్తుండగా.. ఇతర రైతులకు 50 శాతం రాయితీతో అందజేస్తున్నారు. రైతులకు ఆర్థికంగా ఉపయోగపడే పథకం అమలుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఆయిల్ పాంల తోటల ఏర్పాటుపై ఆశలు సన్నగిల్లుతున్నాయి. అధికారులు చేపట్టిన ప్రాథమిక సర్వేల ప్రకారం జిల్లాలో సుమారు 3వేల ఎకరాలు ఆయిల్ పాం సాగుకు అనుకూలంగా ఉన్నట్లు గుర్తించారు. గతేడాది ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా జిల్లాలో 1,048 ఎకరాల్లో తోటలను పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. విడతలవారీగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు 129 ఎకరాల్లో ఏర్పాటు చేశారు. అధికారులు మార్చిలోగా టార్గెట్ పూర్తి చేసేందుకు రైతులకు అవగాహన కల్పించి భూములను సిద్ధం చేసినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు రాకపోవడంతో ఆగిపోయినట్లు తెలుస్తోంది.

బ్యాంకు రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 17 : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం బ్యాంకుల ద్వారా అందిస్తున్న రుణ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారాంతో కలిసి తెలంగాణ గ్రామీణ బ్యాంకు శాఖల ద్వారా జిల్లాలోని 105 స్వయం సహాయక సంఘాలకు మంజూరైన రూ.6 కోట్ల 89 లక్షల చెక్కును మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజేశ్వర్ జోషి, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రామకృష్ణ, తెలంగాణ గ్రామీణ బ్యాంకు అధికారులు, సెర్ప్ అధికారులు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శారద తదితరులు పాల్గొన్నారు.

విడిపోయిన గూడ్స్ రైలు బోగీలు

తృటిలో తప్పిన ప్రమాదం

తాండూర్, డిసెంబర్ 17 : గూడ్స్ రైలు బోగీలు విడిపోయి కొంత దూరం వెళ్లిన ఘటన మంచిర్యాల జిల్లా తాండూర్‌లోని రేచిని రోడ్డు-రేపల్లెవాడ రైల్వే స్టేషన్ల మధ్య నిర్వహించే శనివారం సంత సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. బల్లార్ష నుంచి వరంగల్ వైపునకు వెళ్తున్న గూడ్స్ రైలు ఐబీ సమీపంలోని సంత వద్దకు చేరుకోగానే బోగీలు ఆకస్మాత్తుగా విడిపోయాయి. ఇంజిన్‌తో సహా ముందు భాగం కొంతదూరం వెళ్లిపోయింది. గమనించిన రైల్వేగార్డు లోకో పైలెట్‌కు తెలపడంతో రైలును నిలిపివేశారు. అనంతరం రైల్వే సిబ్బంది సహాయంతో విడిపోయి అక్కడే నిలిచిన బోగీలతో ఇంజిన్ బోగీలను కలిపి తీసుకెళ్లారు. బోగీలు విడిపోయిన విషయం గమనించకపోతే ప్రమాదం జరిగి ఉండేదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

తాండూర్‌లో రైల్వేట్రాక్‌పై విడిపోయిన గూడ్స్ రైలు బోగీలు

చేపల బుట్టలో మొసలి పిల్ల

హాజీపూర్, డిసెంబర్ 17 : మండలంలోని రాపల్లి గ్రామానికి చెందిన మత్స్యకారుడు కునారపు రామయ్య గోదావరిలో చేపల కోసం ఏర్పాటు చేసిన బుట్టలో తీసి చూడగా అందులో ఒక అడుగు మొసలి పిల్ల కనిపించింది. దీంతో భయభ్రాంతులకు గురైన కునారపు రాజయ్య చుట్టుపక్కల వారికి సమాచారం అందించాడు. స్థానికులతో కలిసి గోదావరిలో ఉన్న బుట్టను ఇంటికి తీసుకువచ్చారు. స్థానికులు డిప్యూటీ రేంజ్ అధికారి సునీతకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న డిప్యూటీ రేంజ్, అటవీ శాఖ అధికారులు మొసలి పిల్లను స్వాధీనం చేసుకొని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో వదిలిపెట్టారు. బుట్టలో చిక్కుక్కున్న మొసలి పిల్ల బరువు ఆరు కిలోల వరకు ఉంటుందని అటవీ శాఖ అధికారులు తెలిపారు.

మొసలి పిల్లను పరిశీలిస్తున్న డిప్యూటీ రేంజ్ అధికారి సునీత

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 17: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన రహదారి భద్రత కమిటీ సమావేశానికి ఎస్పీ శ్రీనివాస్ రావు, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావుతో కలిసి హాజరై జాతీయ రహదారుల, రోడ్లు భవనాల, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్, రవాణా, పురపాలక, పంచాయతీ రాజ్ శాఖల అధికారులతో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి వాహనదారులకు తెలిసే విధంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. రహదారులు, కల్వర్టులు, వంతెనల వద్ద ఏర్పడిన గుంతలను పూడ్చివేయాలని, అనుబంధ రహదారుల వద్ద వేగనియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో గత సంవత్సరం 139 ప్రమాదాలు జరిగాయని, ఈ సంవత్సరం జనవరి నుంచి నవంబర్ వరకు 133 ప్రమాదాలు సంభవించాయన్నారు. అధికారుల సమన్వయంతో ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఈఈ ప్రభాకర్, రోడ్డు భవనాల శాఖ ఈఈ శైలేందర్, జిల్లా రవాణా శాఖ అధికారి రాంచందర్, జాతీయ రహదారుల సంస్థ, పంచాయతీ రాజ్, ఆర్టీసీ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే